జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 10-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 189 పేజీలు: 8 వెల : రూ.7



* 48 గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం
* శ్రీకాకుళంలో ధాన్యం ఆరబెట్టే పరిశ్రమను ఏర్పాటు చేస్తాం
* పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
* కలిశెట్టిగూడెంలో మంత్రి పర్యటన



# రైతులకు ముందే.. పండగ


**శ్రీకాకుళం/లావేరు, డిసెంబర్ 9 (వార్త):** రాష్ట్రంలో రైతులందరికీ సంక్రాంతి ముందే వచ్చింది.. వారి నుంచి ధాన్యాన్ని సేకరించిన 24 నుంచి 48 గంటల్లోనే ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం.. అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరు గ్రామ పంచాయతీ కలిశెట్టి గూడెంలో సోమవారం మధ్యాహ్నం ఆయన పర్యటించారు. అక్కడే ధాన్యం కొనుగోలు కేంద్రం పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'అకాల వర్షాల దృష్ట్యా ధాన్యంలో తేమ శాతం పెంచాం. ధాన్యం కొన్న 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు వేస్తున్నాం, రైతుల్లో ధైర్యం నింపేలా వారి దగ్గరకు వెళ్తున్నాం. 17శాతానికి మించి తేమ ఉంటే ధాన్యం కొనక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో ఆ నిబంధనలో మార్పులు చేసి ధాన్యంలో 24-25 తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. శ్రీకాకుళంలో రూ.40 కోట్లతో ధాన్యాన్ని ఆరబెట్టి ఎండబెట్టే పరిశ్రమను నెలకొల్పుతామని, ఉత్తరాంధ్ర జిల్లాల రైతులకు ఈ పరిశ్రమ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో మడ్డువలస, తోటపల్లి కాలువలను ఆధునీకరించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. వాట్సాప్‌లో రైతు హాయ్ అని పెడితే వ్యవసాయ శాఖకు సంబంధించిన మొత్తం సమాచారం అందేలా ఏఐ టెక్నాలజీని రూపొందించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా నిర్ణయించుకుంటే సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నులను ఒక్క శ్రీకాకుళం జిల్లా నుంచే సేకరిస్తున్నామని మనోహర్ చెప్పారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో సాగునీటి కష్టాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తొలగిస్తే రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కోరారు. తోటపల్లి, నారాయణపురం, మడ్డువలస కాలువలను గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో రైతులకు ధాన్యం కొనుగోలు కింద రూ.36 కోట్లు వారి అకౌంట్లలో జమ చేశామని దాదాపు 1.1 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని వివరించారు. ఈనెల 11వ తేదీ నుంచి వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఆ తర్వాత కోతలు, నూర్పులు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, పౌరసరఫరాల శాఖ అధికారులు, బెజ్జపురం యూత్ క్లబ్ చైర్మన్ ప్రసాద రావు మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.





## బుడ్డేపుపేటలో క్షుద్ర పూజలు

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 9 (వార్త):** మండపల్లి పంచాయతీ బుడ్డేపుపేటలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి క్షుద్రపూజలు చేశారని కలకలం రేగింది. దక్కత హరి అనే వ్యక్తి ఇంటి ముందు క్షుద్ర పూజలు తరహాలో ముగ్గులు వేసి నిమ్మకాయలు ఉంచారు. సోమవారం ఉదయం ఈ ముగ్గులను చూసిన గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. రెండేళ్ల క్రితం మండపల్లి గ్రామంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయి. ఇది ఆక తాయిలు పనా లేక చేతబడి లాంటి సంఘటన చోటు చేసుకుందా అని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.



## చీపిలో పులి పాదముద్రలు

**మందస, డిసెంబర్ 9 (వార్త):** మందస మండలం చీపి ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు గుర్తించామని డీఆర్వో రాము తెలిపారు. బావనా పురం చెరువు వద్ద పులి పాదముద్రలు కనిపించాయన్నారు. ఒడిశా సరిహద్దు దాటి ఆంధ్ర ప్రాంతంలోకి ప్రవేశించిందన్నారు. డీఆర్వో ఆధ్వర్యంలో అటవీ అధికారులు పోలయ్య, లక్ష్మణమూర్తి తదితరులు పులి అడుగు జాడలను గుర్తించారు.

# భూ వివాదమే.. హత్యకు కారణం



* శ్రీకూర్మం హత్య కేసులో ఎనిమిది మంది అరెస్టు * డీఎస్పీ వివేకానంద

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 9 (వార్త):** శ్రీకూర్మంలో ఇటీవల జరిగిన హత్యకు భూవివాదమే కారణమని డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు, గార ఎస్ఐ ఆర్.జనార్దన రావుతో కలిసి డీఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడారు. శ్రీకూర్మంలో ఉప్పాడ రాములమ్మకు చెందిన 1.40 ఎకరాల భూమిని ఉప్పాడ రాజేష్ సహకారంతో ఉప్పాడ సూర్యనారాయణ, చుక్కా రాము, అనపాన షణ్ముఖరావులు కొనుగోలుకు అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. తమ ఆధీనంలో ఉన్న భూమిని కొనుగోలు చేశారన్న కోపంతోనే కొయ్య భాస్కరరావు, కొయ్య రమేష్, కొయ్య లోకేష్, కొయ్య గురయ్య, కొయ్య సాయికిరణ్, గుజ్జు లక్ష్మణ, గుజ్జు రామారావు, గుజ్జు శ్రీనులు కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో ఈనెల 6న శ్రీకూర్మంలో రాజేష్, చుక్క రాము, సరోజినిలపై దాడి చేశారన్నారు. వీరిలో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఈ దాడి నుంచి సూర్యనారాయణ తప్పించుకుని పారిపోయాడని తెలిపారు. దాడికి పాల్పడిన ఎనిమిది మందిని అరెస్టు చేశామని, వారి నుంచి కత్తులు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు.

ఆర్మీలో ఉద్యోగాలంటూ.. మోసగించాడు! 3లో

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## సంగమేశ్వరునికి పూజలు

**వంగర, డిసెంబర్ 9 (వార్త):** సంగాంలోని సంగమేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం స్వామికి రుద్రాభిషేకాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతిరావు, సహ అర్చకులు సిద్ధాంతం చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత భక్తులు సువర్ణముఖి, వేగావతి, నాగావళి నదులు కలిసే ప్రదేశంలో స్నానాలు చేశారు. అనంతరం శివలింగానికి పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు బోను ఆనందరావు, బొడ్రోతు శ్రీనువాసరావు, అప్పలనాయుడు ఏర్పాట్లు చేశారు.

# గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

*** ఆదివాసి గిరిజన సంఘం నాయకులు * మండల అధికారులకు వినతిపత్రం**



**మందస, డిసెంబరు 9(వార్త):** మందస మండలంలోని గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కోరారు. గిరిజన సమస్యలపై మందస తహసిల్దార్, ఎంపీడీఓలకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిపిన సమగ్ర సర్వేలో గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలు వెలుగు చూశాయన్నారు. అనేక గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేవని, గిరిజనుల భూములకు రక్షణ కరువైందన్నారు. సామాజిక భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు లేవని, సాగునీరు, తాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. గిరిజనుల భూములు గిరిజనేతరులు ఆక్రమిస్తూ, అడ్డుకున్న గిరిజనులపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు తిరిగి గిరిజనులపైనే కేసులు పెడుతున్నారని, ఐటీడీఏ లేకపోవడంతో గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తారని కోరారు. మందస కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చాలని, 50శాతం గిరిజనులు ఉన్న అన్ని గ్రామాలను నోటిఫై చేయాలని, అన్ని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు అయినటువంటి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని, పక్కా ఇల్లు మంజూరు చేయాలన్నారు. సామాజిక భవనాలు అన్ని గిరిజన గ్రామాల్లో నిర్మించాలని, కొండలోగాం, చీపి, సాబకోట, హంసరాలి తదితర పంచాయతీల్లో భూ అక్రమణలను అరికట్టాలని, జరుగుతున్న దాడులను అరికట్టి గిరిజనులకు రక్షణ కల్పించాలన్నారు. ఇప్పటికే గిరిజనేతరులు ఆక్రమించుకున్న గిరిజన భూములను తిరిగి గిరిజనులకే అప్పగించాలని, గిరిజనులు అధికంగా ఉన్న పంచాయతీలను గిరిజన పంచాయతీలుగా ప్రకటించాలన్నారు. అన్ని గిరిజన గ్రామాలకు ఎత్తిపోతలు కాలువల ద్వారా సాగునీరు అందించాలన్నారు. మందస, పలాస గ్రామాల సరిహద్దుల్లో భూవివాదాలు పరిష్కరించాలని, రాష్ట్ర సరిహద్దు సమస్యగా ఉన్న గిరిజన గ్రామాల్లో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండల కేంద్రం నుండి గిరిజన గ్రామాలకు వెళ్లే అన్ని రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరారు. గిరిజన పంచాయతీల్లోని సచివాలయాల్లో ఖాళీగా ఉన్న స్థానాల్లో ఇన్‌చార్జీలను కాకుండా పూర్తిస్థాయిలో అధికారులను, వివిధ స్థానాల్లో ఖాళీగా పోస్టులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సవర ధర్మారావు, జిల్లా సహాయ కార్యదర్శి సవర ఫల్గుణరావు, జిల్లా కమిటీ సభ్యుడు సవర గురునాథ్, జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, గిరిజన సంఘం నాయకులు ఎస్ భావన, ఎస్.గురుమూర్తి, ఎస్.పరశురాం, ఎస్.నితిన్, మోహన్ రావు, కైలాశ్ పాల్గొన్నారు.

# మహోన్నత వ్యక్తులను మరువలేం

***రిటైర్డు విద్యాశాఖ అధికారి ప్రభాకరరావు**
***రిటైర్డు ఎంఈవో వాసుదేవరావు సంతాప సభ**



**పోలాకి, డిసెంబర్ 9 (వార్త):** ఆదర్శవంతమైన భావాలతో అలుపెరగని క్రమశిక్షణతో జీవిత నేపథ్యం ఎరిగిన మహోన్నత వ్యక్తులను మరువలేమని రిటైర్డు విద్యాశాఖ అధికారి ఆబోతుల ప్రభాకరరావు అన్నారు. సోమవారం పోలాకి శాఖ గ్రంథాలయం ప్రాంగణంలో విశ్రాంతి మండల విద్యాశాఖ అధికారి యారబాటి వాసుదేవరావు సంతాప సభలో మాట్లాడారు. వ్యక్తులను కీర్తించాలంటే తన గుణాలే సాక్ష్యమని అన్నారు. సభాధ్యక్షులు స్థానిక సర్పంచ్ మజ్జి రవణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డు మండల పరిషత్ అధికారి ఎ.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఆప్తులను ఆదరించుటలో ముందున్న వ్యక్తి వాసుదేవరావు అని అన్నారు. రిటైర్డు మండల విద్యాశాఖ అధికారి కూన మధుసూదన రావు, ఇంజరాపు రంగారావు మాట్లాడుతూ కార్యనిర్వహణ వ్యవస్థలపై పట్టున్నవారని, కుటుంబాల నేపథ్యం ఎరిగిన వారని అన్నారు. వాసుదేవరావు మంచి వ్యక్తి అని, అందరికీ సాయపడే వ్యక్తి అని ఆధ్యాత్మికవేత్త తాడి ఎర్రయ్య అన్నారు. ఉద్యోగుల సంఘం రిటైర్డు కార్యదర్శి వై.రామారావు మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగుల సంఘం నిర్మాణానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. నేతింటి వల్లన్నాయుడు మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగుల సంఘం నిర్మాణానికి కృషి చేయాలని అందుకు సమిష్టి కృషితో సాధ్యమవుతుందని చెప్పారు. ఈ నెల 17వ తేదీన పెన్షనర్స్ డే సందర్భంగా పదవీ విరమణ పొందిన ఐదుగురు సీనియర్స్ ఉద్యోగులను సన్మానం చేయుటకు కీర్తిశేషులు యారబాటి వాసుదేవరావు ప్రతిపాదించిన ప్రతిపాదన అమలు చేయుటకు సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్యక్రమంలో పోలాకి సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, పొట్నూరు వెంకటరమణమూర్తి, జలుమూరు మండలం విశ్రాంతి మండల విద్యాశాఖ అధికారి గంగాధరరావు, మార్పు ముకుంద రాజులు, సర్వేయర్ చిన్నప్పన్న, పలువురు విశ్రాంతి ఉద్యోగులు, అభిమానులు పాల్గొన్నారు.

## కాకినాడ ఆదిత్యలో యూత్ రెడ్‌క్రాస్ విభాగం

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 9(వార్త):** కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్ (ఉమెన్స్)లో యూత్ రెడ్‌క్రాస్ విభాగాన్ని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ సోమవారం ప్రారంభించారు. వాలంటీర్లను ఉద్దేశించి జగన్మోహన్ రావు మాట్లాడుతూ యువతకు విద్యతో పాటు సమాజ సేవకు ముందుండాలన్నారు. కార్యక్ర మంలో జిల్లా రెడ్ క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ జి. రమణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణు, యూత్ రెడ్ క్రాస్ కాలేజ్ కన్వీనర్ మోహన్ రావు, రెడ్‌క్రాస్ పీఆర్వో చైతన్య కుమార్, ఉమా శంకర్, పవన్, కాకినాడ ఆదిత్య సిబ్బంది పాల్గొన్నారు




# సాగునీటి సమస్య లేకుండా చూస్తాం

*** శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 9 (వార్త):** నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సాగునీరు అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ పరిధిలోని టి.మన్నయ్యపేటలో సోమవారం చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెరువులను పట్టించుకోకపోవడంతో రైతులకు సాగునీరు అందకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి కాలువల్లో పూడికలు తీయించి, చెరువులను బాగు చేయించి రైతులకు అండగా నిలుస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు బాంధవుడు అని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్ముతారన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో విత్తనం నాటిన నుంచి ధాన్యం విక్రయించే వరకు రైతులకు అండగా ఉంటామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





## ఆర్గానిక్ ఉత్పత్తులే ఆరోగ్యకరం

**పోలాకి, డిసెంబర్ 9 (వార్త):** ప్రస్తుత పరిస్థితులు వాతావరణంలో మార్పుల వల్ల ఆర్గానిక్ ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యం పొందవచ్చని పోలాకి తహసీల్దార్ ఎం.సురేష్ కుమార్ అన్నారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ కూరగాయల స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల ద్వారా పండించే కాయగూరల కొనుగోలు ద్వారా పరోక్షంగా రైతులను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి చిరంజీవి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపైన ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతు సాధికార సంస్థ ద్వారా ప్రభుత్వం రైతు శ్రేయస్సుకు ఎనలేని కృషి చేస్తుందని చెప్పారు. మండలంలో ఇప్పటికే ఏపీ సీఎన్ఎఫ్ ప్రాజెక్టు ద్వారా గొల్లలవలస, గాతలవలస, యాట్లబసివలస, రహిమాన్ పురం వంటి గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు మండల యూనిట్ ఇన్చార్జి బొడ్డేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ స్వయం శక్తి సంఘాల ద్వారా సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేస్తూ పలు వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో విక్రయిస్తున్నామన్నారు. ఐసిఆర్పి కార్యకర్త వండాన వెంకటరమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సేంద్రీయ ఎరువులు ఉత్పత్తుల ద్వారా లబ్ధి పొందుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యకర్తలు కె.జ్యోతి, సీహెచ్ దమయంతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గరిమెళ్ల కవితా స్రవంతి పుస్తకావిష్కరణ

**పోలాకి, డిసెంబర్ 9(వార్త):** విజయనగరం అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ప్రచురించిన 'గరిమెళ్ల కవితా స్రవంతి' అనే పుస్తకాన్ని మంగళవారం ప్రియాగ్రహారంలో గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆవిష్కరిస్తామని గరిమెళ్ల మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు బాడాన రాజు, ఐ.గణపతిరావు, దుబ్బ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ రచించిన అభ్యుదయ కవితలన్నీ అభ్యుదయ రచయితల సంఘం గరిమెళ్ల కవితా స్రవంతి పేరిట ప్రచురించారన్నారు. అరసం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు, కార్యదర్శి చింతాడ కృష్ణారావు, విజయనగరం జిల్లా కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, గిడుగు రామ్మూర్తి, జానపద కళా పీఠం అధ్యక్షుడు బద్రి కుర్మారావు, గరిమెళ్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.నాగకుమారి ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వేశ్వరరావు అతిథులుగా పాల్గొననున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ అభిమానులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## ప్రెస్‌క్లబ్ ఎన్నికలు నిర్వహించండి




**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 9 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రెస్‌క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలని పలువురు జర్నలిస్టులు కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్ వద్ద పలువురు పలు యూనియన్లకు చెందిన జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రెస్‌క్లబ్ భవనాన్ని కొందరు కబ్జా చేశారన్నారు. దీనివల్ల మిగతా జర్నలిస్టులకు వేదిక కరువైందని తెలిపారు. ప్రెస్‌క్లబ్ భవనం ద్వారా వస్తున్న ఆదాయాన్ని సొంతానికి కొందరు వాడుకుంటున్నారని, కనీసం ఈ భవనానికి రంగులు కూడా వేయకపోవడం దారుణమన్నారు. ప్రెస్‌క్లబ్ భవనం ఏ ఒక్కరి సొంతం కాదన్నారు. జర్నలిస్టులందరిదన్నారు. అనంతరం జర్నలిస్టుల యూనియన్ ప్రతినిధులు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కలిసి ప్రెస్‌క్లబ్ భవనం ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్లకు చెందిన జర్నలిస్టులు డోల శంకర్రావు, చింతపల్లి నాగభూషణరావు, గురుగుబెల్లి అప్పలనాయుడు, చింతాడ అప్పలనాయుడు, డోల అప్పన్న, తిత్తి ప్రవీణ్ కుమార్, టెంక శ్రీను, గుండబాల మోహన్, బెహరా షణ్ముఖ, బద్రి, కామేష్, బొడ్డ కృష్ణ, అద్దంకి సురేష్, బాలు, దిలీప్, రాజేష్, వాసు, గణపతి, లక్ష్మణ్, జనార్దన్, రాజేష్, ధను, భరత్, ధనుంజయ, రవి, ప్రవీణ్, లీలా, సింగూరు శ్రీను, చిన్నారావు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీలో ఉద్యోగాలంటూ.. మోసగించాడు!

### ఆర్మీ కాలింగ్ నిర్వాహకుడిపై మీకోసంలో బాధితుల ఫిర్యాదు



**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 9 (వార్త):** ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలు వసూలు చేసి మోసగించాడని ఆర్మీ కాలింగ్ సంస్థ నిర్వాహకుడు బీవీ రమణపై బాధితులు 'మీ-కోసం'లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఏఎస్పీ కేవీ రమణకు ఫిర్యాదు చేశారు. సోమవారం జడ్పీ ముందు తొమ్మిది మంది బాధితులు మీడియాతో మాట్లాడుతూ తాను ఓ ఆర్మీ ఉద్యోగినని, తనకు చాలా మంది తెలుసని, ఆర్మీలో శిక్షణ ఇవ్వడతో పాటు ఉద్యోగాలు కూడా వేయిస్తానని చెప్పాడన్నారు. శిక్షణ కాలంలో చిత్రహింసలు పెట్టేవాడని వాపోయారు. ఈ సమస్యను ఇటీవల తమ దృష్టికి తెచ్చారని ఎక్స్ సర్వీస్‌మెన్ జేఏసీని ఆశ్రయించారని జేఏసీ ప్రతినిధులు మూర్తి, రామారావు, శంకరనారాయణ, ఏవీఆర్ మూర్తి విలేకరులకు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన చాలామంది ఆర్మీ కాలింగ్ సంస్థ నిర్వాహకుడు చేతిలో మోసపోయారన్నారు. దీంతో బాధితులతో కలిసి కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు.



## నరసన్నపేట - ఇచ్ఛాపురం హైవేను ఆరు లైన్లకు విస్తరించాలి

* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
* జాతీయ రహదారుల శాఖ అధికారులతో సమీక్ష

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 9(వార్త):** రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగమయ్యేలా స్థానిక జిల్లా మీదుగా ఉన్న జాతీయ రహదారి-16ను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనికి అనుగుణంగా నరసన్నపేట-ఇచ్ఛాపురం మధ్య ఉన్న జాతీయ రహదారిని ఆరు లైన్లకు విస్తరించాలని సూచించారు. హైవే అధికారులతో విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే విశాఖపట్నం - నరసన్నపేట వరకు 100 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల జాతీయ రహదారి ఉందని, ఒడిశా సరిహద్దు ఇచ్ఛాపురం వరకు కూడా ఇదే విధంగా విస్తరణ చేపట్టాలని కోరారు. దీని కారణంగా ప్రయాణం, సరుకు రవాణా వేగవంతం చేయవచ్చని పేర్కొన్నారు. దీనితో పాటు నూతనంగా నిర్మాణం కానున్న భోగాపురం - మూలపేట పోర్టును అనుసంధానం చేసేలా విశాఖపట్నం - మూలపేట బీచ్ కారిడార్ రోడ్డు ప్రతిపాదనలపై పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే జిల్లాలోని మత్స్యకార గ్రామాలను జాతీయ రహదారితో కలపడంతో పాటు ఎగుమతులు పెరిగి.. మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచవచ్చని వివరించారు. దీంతో పాటు శ్రీకాకుళం నగరంలోకి వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా నవభారత్ జంక్షన్ నుంచి బైపాస్ వరకు ఉన్న జాతీయ రహదారిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన హైవే అధికారులు.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, పనుల వేగవంతానికి కృషి చేస్తామని తెలిపారు.

## 31వ డివిజన్‌లో పౌష్టికాహార మాసోత్సవం



**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 9 (వార్త):** నగరంలోని 31వ డివిజన్ పరిధిలో గల అంగన్వాడీ కేంద్రంలో సోమ వారం పౌష్టికాహార మాసోత్సవాన్ని అంగన్వాడీ టీచర్లు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 31వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ విభూతి సూరిబాబు పాల్గొని మాట్లాడారు. తల్లి పాలే బిడ్డలకు శ్రీరామ రక్ష అని చెప్పారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, అందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని గుర్తు చేశారు. పౌష్టికాహారంతో అనారోగ్యం దూరం అవుతుందన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం పాలిథిన్ కవర్లను వాడడం మానేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పార్వతి, బాలింతలు, గర్భిణిలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులు పరిష్కరించండి

* అదనపు ఎస్పీ (అడ్మిన్) కేవీ రమణ





**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 9(వార్త):** ప్రజా ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని అదనపు ఎస్పీ కేవీ రమణ జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 64 వినతులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరిత గతిన పరిష్కారం చూపాలని జిల్లా పోలీసు అధికారులకు సూచించారు.

### అర్జీలపై దృష్టి సారించాలి


అర్జీలపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక అర్జీదారుల నుండి ఆయనతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లతో అర్జీలు స్వీకరించారు. అర్జీల పై అధికారులు సత్వర పరిష్కారం చేసి డిస్పోజ్ చేయాలన్నారు. 71 అర్జీలు స్వీకరించగా ఇందులో రెవెన్యూ-28, పంచాయతీ రాజ్-5, సర్వే అండ్ లాండ్ రికార్డులు - 4, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ రూరల్ పవర్టీ-3, ఎపి టిడ్కో - 3, ఎపిఈపీడిసియల్ - 3, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ - 2, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు - 2, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ - 2, స్కూల్ ఎడ్యుకేషన్ - 2, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ - 2, మహిళా శిశు సంక్షేమ శాఖ - 2, రూరల్ డెవలప్‌మెంట్ - 2, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ - 2, ట్రెజరీ, దేవదాయ శాఖ, మైన్స్ అండ్ జియాలజి, రిజిస్ట్రేషన్, పబ్లిక్ హెల్త్, సాంఘిక సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, ఆర్డబ్ల్యుఎస్, విభిన్న ప్రతిభా వంతులు శాఖలకు సంబంధించి ఒక్కొక్క అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో ఉప కలెక్టర్ అప్పారావు, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ, తదితర శాఖల అధికారులు ఉన్నారు.

## విద్యావ్యవస్థను గాడిలో పెట్టడమే ప్రభుత్వ లక్ష్యం

* నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**జలుమూరు/పోలాకి, డిసెంబర్ 9(వార్త):** గడచిన ఐదేళ్లు చిన్నాభిన్నమైన ప్రభుత్వ విద్యా వ్యవస్థని గాడిలో పెట్టడానికే విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు కృషి చేస్తున్నారని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం జలుమూరు మండలం దరివాడ గ్రామంలో మన బడి మన భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా రూ.36లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి మెరుగైన విద్యను అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. అందులో భాగంగానే ఈనెల 7న పేరెంట్స్ కమిటీ సమావేశాలు తల్లితండ్రులు భాగస్వామ్యంతో నిర్వహించడం జరిగిందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తొలి ప్రాధాన్యతను విద్యకి ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం అవగాహన లోపంతో పాఠశాలల నిర్వహణ నిర్వీర్యం చేసిందని, రూ. 5 వేల కోట్లు ఖర్చు చేసి నాడు నేడు పనులు జరిపించి సగంలోనే నిలుపుదల చేసిందని, పాఠశాలలను లేకుండా ఎత్తివేసిందని విమర్శించారు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి ప్రతినిధి మెండ రాంబాబు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వాన గోపి, మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు భైరి భాస్కరరావు, వెలమల చంద్ర భూషణ్, మునికోటి దాంబాబు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ మన్మథ, గుండ మన్మథ, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 9 (వార్త):** నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నియోజకవర్గం ప్రెసిడెంట్ డి.కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, ఆదిత్య భారతి జూనియర్ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ పోటీలలో కావ్య, బి.మేనక (ఆదిత్య డిగ్రీ కళాశాల) లోహిత్ పాత్రో, బి.కామేష్ (ఆదిత్య జూనియర్ కళాశాల), కె.ప్రియాంక, బి.మమత (ప్రభుత్వ డిగ్రీ కళాశాల) విజేతలుగా నిలిచారు. మానవ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం రోజున ముఖ్య అతిథులు బహుమతులు అందజేస్తారని డి.కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట రామారావు, కే.సి.పూరి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రోబీన్ కుమార్ పాడి, ఆదిత్య జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

# 11, 12 తేదీల్లో జిల్లాలో వర్షాలు

* రైతులు 12 తర్వాతే కోతలు, నూర్పులు చేయాలి
* ధాన్యం సేకరణకు జిల్లాలో 402 కొనుగోలు కేంద్రాలు
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 9(వార్త):** జిల్లాలో ఈనెల 11, 12 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ఈ నెల 12వ తేదీ తర్వాతే వరి కోతలు, నూర్పులు చేయాలన్నారు. తుఫాన్ నేపథ్యంలో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. సోమవారం జిల్లా పరిషత్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ధాన్యం నూర్చి కళ్లాల్లో సిద్ధంగా ఉన్నట్లు తెలియజేస్తే ధాన్యం సేకరణకు మిషనరీ, మిల్లర్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 54 వేల టన్నులు ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో ఉన్నట్లు వెల్లడించారు. పది వేల టన్నులు ధాన్యం రెండు రోజుల్లో వస్తుందని అంచనా ఉన్నట్టు చెప్పారు. 64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో మన వద్ద ఉన్న మిషనరీ, వాహనాలు, బస్తాలతోను, మిల్లర్లు కెపాసిటీతో 30 వేల టన్నులు కొనుగోలు చేయవచ్చన్నారు. ఒక రోజులో 15 వేల టన్నులు ధాన్యం కొనుగోలు చేయవచ్చని తెలిపారు. మరో 34 వేల టన్నులు ధాన్యం ఉంటుందని, ఆ ధాన్యాన్ని సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలని రైతులను కోరారు. ఎక్కడైతే సురక్షితమైన ప్రదేశాలకు ఉండవో అలాంటి వారికి డిజాస్టర్ మేనేజ్ మెంట్ వద్ద ఉన్న నిధులతో పౌర సరఫరాల శాఖ నుండి టార్పాలిన్లు కొనుగోలు చేసి పిపిసి కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. వారం రోజుల ముందు మాత్రం వాహనాలు లేవని సమాచారం వచ్చిందని, ఇప్పటి వరకు జిల్లాలో 3 వేల వరకు వాహనాలు జిపియస్‌తో ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో 402 ధాన్యం సేకరణ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పలాస, ఇచ్ఛాపురంలలో పంట కోత ఇంకా చేయలేదని, జిల్లాలో నరసన్నపేట, టెక్కలి, ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాతపట్నం, శ్రీకాకుళంలలో కోతలు, నూర్పులు జరుగుతున్నందున రైతులు వర్షాలను దృష్టిలో పెట్టుకుని పంట కోసిన, నూర్చిన ధాన్యాలను జాగ్రత్త చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో పేమెంట్స్ జరుగుతాయని, పేమెంట్స్‌లో ఎలాంటి సమస్య లేదన్నారు. కొన్ని సందర్భాల్లో రెండు మూడు గంటల్లోను పేమెంట్స్ రైతుల ఖాతాల్లో జమ జరుగవచ్చన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా జెసి, కలెక్టర్‌లకు తెలియజేయవచ్చన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 4.9 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఉందని, ఇప్పటి వరకు 1.1 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమైనదని, దాదాపుగా 1/4 సేకరణ జరిగిందన్నారు. గత యేడాది కంటే ఈ యేడాది ధాన్యం సేకరణ ఎక్కువ జరిగిందని, వర్షాలు పడినందు వలన పంటలు కూడా బాగా పండాయన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో 228.73 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లర్లకు తగు సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ చెప్పారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అనాధలకు దుప్పట్లు పంపిణీ



**సోంపేట, డిసెంబర్ 9 (వార్త):** సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న 30 మంది వృద్ధులకు జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ మనోవికాస నిపుణుడు రాంబుడ్డి గణపతి దుప్పట్లు పంపిణీ చేశారు. దక్షత లేనటువంటి వయోవృద్ధులకు మరింత సహాయం చేయుటకు ముందుకు వచ్చిన గణపతి మాస్టర్‌లా మరింత మంది ముందుకు రావాలని ఆశ్రమం నిర్వాహకులు గుళ్ల రమేష్, మోహనరావు కోరారు. ఈ కార్యక్రమంలో రత్నాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# 14 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 9 (వార్త):** రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో లొద్దపుట్టి ఫ్లై ఓవర్ వద్ద ఒడిశాకు చెందిన బిద్యాధర్ సింగ్ అనే వ్యక్తి నుంచి 14.450 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ చిన్నంనాయుడు తెలిపారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావుకి అందిన సమాచారం మేరకు ఆ వ్యక్తిని తనిఖీ చేశారన్నారు. ఈ గంజాయిని కేరళ తరలిస్తుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

### 8 కిలోల గంజాయితో ఒడిశా వాసి..

**పాతపట్నం,డిసెంబర్ 9(వార్త):** పాతపట్నం మండలం కాపు గోపాలపురం గ్రామ శివారులో అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పాతపట్నం ఎస్ఐ బి.లావణ్య తనిఖీ చేశారు. అతని వద్ద 8.132 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈవిషయాన్ని పాతపట్నం సీఐ వి.రామారావు మీడియాకు సోమవారం వివరించారు. ఒడిశాలోని సొగిడి గ్రామానికి చెందిన సంజయ్ బదరైతాగా గుర్తించామన్నారు. అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.





## 300 సారా ప్యాకెట్లు స్వాధీనం



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 9 (వార్త):** ఒడిశా నుంచి 300 నాటుసారా ప్యాకెట్లను లబన్య దొలయ్ అనే వ్యక్తి స్కూటీలో తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ పీడీ ప్రసాద్ చెప్పారు. స్కూటీని సీజ్ చేశామని దొలయ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

## ఉచిత ఏసీ టెక్నీషియన్ రిపేర్ కోర్స్

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 9(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వ ర్యంలో ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ లో ఉచిత ఏసీ టెక్నీషియన రిపేర్ కోర్స్‌పై విక్షణ ఇవ్వనున్నామని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధి కారి సాయికుమార్ తెలిపారు. ఈ కోర్సుకు టెన్త్ క్లాస్ నుండి డిగ్రీ, బీటెక్ చదివిన వారు అర్హుల న్నారు. పేర్ల రిజిస్ట్రేషన్ కోసం స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సత్య సాయి వెంకటేష్ (75690 77449)ను సంప్రదించాలన్నారు. 18 నుంచి 30 సంవత్సరాలలోపు వారు అర్హులని సోమవారం ఒక ప్రకటనలో సాయికుమార్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## సకాలంలో పన్నులు చెల్లించాలి

**రాజాం, డిసెంబర్ 9 (వార్త):** పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని రాజాం మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను, కొళాయి పన్ను లు చెల్లించాలన్నారు. మొండి బకాయి దారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. పన్ను చెల్లించుకుంటే కొళాయి కనెక్షన్ కట్ చేస్తామన్నారు.

## అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

**రాజాం, డిసెంబర్ 9 (వార్త):** ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జై భీమ్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం అమ్మినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం షాపుల నిర్వాహకులు సమయపాలన పాటించాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 9 (వార్త):** స్థానిక గొల్ల వీధి ఆంధ్రా బాపిస్టు చర్చ్‌లో యూత్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ జాన్సన్ కొవ్వొత్తి వెలిగించి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ప్రత్తి విజయ్ కుమార్, మాచర్ల సత్యనారాయణ, యూత్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ దీపక్, ప్రత్తి అన్వేష్, ట్రెజరర్ జూన్ వికాశ్, పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్విజ్‌పోటీలకు ఆదర్శపాఠశాల విద్యార్థిని

**పొందూరు, డిసెంబర్ 9 (వార్త):** రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ కౌశల్ క్విజ్ పోటీలకు పొందూరు మండలంలోని వావిలిపల్లిపేట ఆదర్శపాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.వినీష ఎంపికయ్యారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లా స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ క్విజ్‌పోటీలో పదో తరగతి నుంచి రాష్ట్రస్థాయికి ఒక్కరే ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తెలిపారు. విద్యార్థినికి గైడ్‌గా బోటనీ ఉపాధ్యాయుడు జి.జీవన్‌బాబు వ్యవహరిస్తారు. రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికైన విద్యార్థినిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది అభినందించారు.

## రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు




**హిరమండలం, డిసెంబరు 9 (వార్త):** రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ వి.హనుమంతరావు అన్నారు. సోమవారం ఎం.అవలంగి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతీ రైతు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ పరిశీలకుడు ఎం.ఉమాశంకర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఆక్రమణలు వెలికితీసేందుకే..

# రెవెన్యూ సదస్సులు

*** ఎమ్మెల్యే కూన రవికుమార్**

పొందూరు, డిసెంబర్ 9 (వార్త): వైసీపీ ప్రభుత్వంలో సర్వేపేరుతో భూఆక్రమణలకు పాల్పడ్డారని వాటిని వెలుగులోకి తెచ్చేందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని గోరింట గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో రీసర్వే చేపట్టి వాటిని స్వాహా చేసేందుకు గత ప్రభుత్వం సిద్ధమైందన్నారు. సర్వేపేరుతో అమాయకుల భూములు ఆక్రమించారన్నారు. అటువంటి తప్పిదాలు జరగకుండా అడ్డుకునేందుకు ఇటువంటి రెవెన్యూ సదస్సులు నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులకు అందుబాటులో ఉండే మిల్లర్ల వద్ద ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గోరింట గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు ధాన్యం విక్రయించేందుకు నానాఅవస్థలు పడ్డారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన 24 గంటల్లోనే నగదు వారి ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్ రామానుజం, సర్పంచ్ శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చిగిలిపల్లి రామమోహనరావు, టీడీపీ నేతలు కూన వెంకట సత్యనారాయణ, అన్నెపు రాము, బలగ శంకర్ భాస్కరరావు, సీపాన శ్రీరంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ల్యాండ్ బ్యాంకును సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం

*** శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 9 (వార్త):** నియోజకవర్గంలో ప్రభుత్వ భూములకు సంబంధించి ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సాయిప్రత్యూషతో పాటు శ్రీకాకుళం, గార తహశీల్దార్లతో సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే శంకర్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ల్యాండ్ బ్యాంకును గుర్తించి రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పరిశ్రమలు, ఇనిస్టిట్యూషన్‌లు, పేదలకు ఇళ్లు అందించేందుకు వినియోగిస్తామని తెలిపారు. సోషల్ వెల్ఫేర్ కింద గతంలో ల్యాండ్ అక్విజేషన్ కాలనీకి ల్యాండ్ అక్విజేషన్ చేశారని తెలిపారు. ఎంత మేర భూమి ఉంది.. మున్ముందుకు మరింత మంది లబ్ధిదారులకు అందించేందుకు అవకాశాలు ఉన్నాయేమో పరిశీలించాలని ఆర్డీఓను కోరారు. అలాగే సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాటికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో రికార్డు సిద్ధం చేసినట్టైతే ప్రభుత్వానికి నివేదికను అందించేందుకు సులువు అవుతుందని చెప్పారు. అలాగే కొన్ని చోట్ల భూసర్వే రికార్డులు తప్పులు ఉన్నాయని రికార్డులను తెప్పించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో బోగస్ ఓట్లు ఉన్నట్టు గుర్తించామని వాటి తొలగింపునకు సమగ్ర దర్యాప్తు చేయాలని ఆర్డీఓను కోరారు. మరో వారం పది రోజుల్లో అన్ని రికార్డులను సరి చేస్తామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546